క్లుప్తంగా

మాజీ ప్రధాని సేవలు మరువలేనివి



బిచ్కుంద(జుక్కల్): దివంగత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి సేవలు మరువ లేనివని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని పెద్ద తక్కడ్‌పల్లిలో శనివారం శాస్త్రి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశ ప్రగతికి, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. మండల ఉపాధ్యక్షుడు రవి పటేల్, నాయకులు హన్మంత్‌రావు దేశాయి,అశోక్, ఖలీల్ ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

కామారెడ్డి టౌన్: యాదాద్రి జిల్లాలోని కేజీబీవీ వలిగొండలో వంట పనిచేస్తూ గాయాలపాలై, చికిత్స పొందుతూ మృతి చెందిన సమగ్ర శిక్ష ఉద్యోగి హెడ్‌కుక్ మల్లమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. అలాగే సమ్మె సమయంలో మృతిచెందిన ఇద్దరి కుటుంబాలను సైతం ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని గంజ్ ధర్మశాల బ్రాహ్మణపల్లి ఆటోస్టాండ్ వద్ద శనివారం ఆటో జేఏసీ ఆధ్వర్యంలో డ్రైవర్లకు జిల్లా అధ్యక్షుడు నర్సింలు గుర్తింపు కార్డులను అందజేశారు. ఆటోస్టాండ్ అధ్యక్షుడు పర్శ నర్సింలు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన మైనారిటీ ఉద్యోగులు



బాన్సువాడ: హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీలో నిర్వహించనున్న మైనారిటీ ఉద్యోగుల సమావేశానికి శనివారం బాన్సువాడ డివిజన్‌కు చెందిన మైనారిటీ ఉద్యోగులు తరలివెళ్లారు. తెలంగాణ మైనారిటీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మైనార్టీ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. డివిజన్ అధ్యక్షుడు వహాబ్, ప్రధాన కార్యదర్శి హాజీ, కోశాధికారి అబ్దుల్ రజాక్, యూనియన్ సభ్యులే ఉన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



బిచ్కుంద(జుక్కల్): దానాలలో గొప్పది రక్తదానం అని, యువకులు రక్తదానం చేయుటకు ముందుకు రావాలని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పిలుపునిచ్చారు. బిచ్కుంద ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం జగద్గురు నరేంద్ర మహారాజ్ ఆధ్వర్యంలో భక్తులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే శిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. శిబిరంలో 85మంది రక్త దానం చేశారు. బీఆర్ఎస్ నాయకులు నాల్చర్ రాజు, సొసైటీ చైర్మన్ బాలాజీ, ముఖీద్, స్వామిజీ భక్తులు సాయిలు పాల్గొన్నారు.

శబరిమల అయ్యప్పను దర్శించుకున్న జుక్కల్ ఎమ్మెల్యే



నిజాంసాగర్(జుక్కల్): కేరళ రాష్ట్రంలోని శబరిమల అయ్యప్ప స్వామిని శనివారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయ సన్నిదిలో ఎమ్మెల్యేను అర్చకులు ఘనంగా సత్కరించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన మెంగవరం శంకర్ శర్మ తన సెల్‌ఫోన్ ఇటీవల పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు ఫోన్‌ను రికవరీ చేసి, బాధితుడికి శనివారం అందజేశారు. ఎస్సై సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

తాడ్వాయి కళాశాలలో సమస్యల తిష్ట

- విద్యార్థులకు సరిపడా లేని గదులు
- భవనానికి ప్రహరీ నిర్మించని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యల వలయంలో చిక్కుకుంది. గ్రామీణ విద్యార్థులు కళాశాల విద్యను అభ్యసించడానికి ప్రభుత్వం ప్రతి మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాలలను నిర్మించింది. ఈమేరకు తాడ్వాయిలోనూ కళాశాలను నిర్మించగా, కనీస సౌకర్యాలకు కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ కోర్సులు ఉండగా సుమారు 200 మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సరిపడక గదులు లేకపోవడంతో వరండా, ఆఫీసు కార్యాలయంలోనూ అధ్యాపకులు పాఠాలను బోధిస్తున్నారు. అలాగే కళాశాల భవనం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో కళాశాల ఆవరణలో పశువులు తిరుగుతూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. హరితహారం కింద కళాశాల ఆవరణలో నాటిన మొక్కలను కొన్ని రోజులకే పశువులు మేశాయి. విద్యార్థులకు తాగునీటి కోసం కళాశాల ఆవరణలో బోర్లు వేసినప్పటికీ అందులో నీరు లేకపోవడంతో కిలోమీటర్ దూరం వరకు నడిచి హోటళ్లు, దుకాణాలలో నీటిని తాగవలసి వస్తోంది. అలాగే ప్రాక్టికల్స్ చేయడానికి ప్రత్యేక గదులు లేవు. సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. కనీస వసతులు లేకపోవడంతో వార్షిక పరీక్షలు గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



కళాశాలలో ప్రహరీ నిర్మాణం, అదనపు గదులు, రోడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిపడ లేక ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలలో మౌళిక వసతుల కోసం రాష్ట్ర అధికారులకు ప్రతిపాదనలు పంపించాము.

– సయ్యద్ యూసుఫ్ హుస్సేన్, ప్రిన్సిపాల్

ప్రహరీ నిర్మించాలి



మా కళాశాలకు ప్రహరీ లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నాం. ఆవరణలో పశువులు సంచరించడంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలి.

– రవితేజ, సెకండియర్ విద్యార్థి

అధికారులు పట్టించుకోవాలి



కళాలలలో ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకొని తీర్చాలి. కనీసం వచ్చే విద్యా సంవత్సరం వరకైనా కళాశాలలో అన్ని రకాల వసతులను ఏర్పాటు చేయాలి.

– కృష్ణవేణి, ఫస్టియర్ విద్యార్థి

మొక్కలు ధ్వంసం అవుతున్నాయి



కళాశాల ఆవరణలో ప్రతియేటా హరితహారం కింద మొక్కలు నాటుతున్నాం. కానీ కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు సంచరించి, మొక్కలను మేస్తున్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి. – సాయి, సెకండియర్ విద్యార్థి

తాగునీటి సమస్యను తీర్చాలి



మా కాలేజీలో తాగునీటి సమస్యను తీర్చాలి. నిత్యం నీళ్ల కోసం హోటళ్లను ఆశ్రయిస్తున్నాం. అధికారులు, చొరవ తీసుకొని కళాశాల ఆవరణలో బోరువేయించి తాగునీటిని ఏర్పాటు చేయాలి.

–శ్రీజ, ఫస్టియర్ విద్యార్థి

భక్తి శ్రద్ధలతో కుడారై ఉత్సవం



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ధనుర్మాసం ఉత్సవాల్లో భాగంగా కుడారై ఉత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాలస్వామి వారికి కుడారై తిరుప్పావై పారాయణం చేస్తు 108 దొప్పల్లో పాయసాన్నం నివేదించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పాయసాన్నాని ప్రసాదంగా అందజేశారు. ఆలయ అర్చకులు మధు, రంగాచారి, ధనుర్మాస ఉత్సవ కమిటీ ప్రతినిధులు, శ్రీకృష్ణ ఆదర్శ సంఘం, యోగా, గీతా భవనం, గంజువర్తక సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తిపాటలు పాడుతూ భజనలు చేశారు.

వైభవంగా గోదారంగనాథుల కళ్యాణోత్సవం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌లోగల వేంకటేశ్వర ఆలయంలో శనివారంగోదారంగనాథుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు రవికాంత్ ఆలయంలో ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, అభరణాలతో అందంగా అలంకరించి కల్యాణ వేదికపై ఏర్పాటు చేసి, కల్యాణం నిర్వహించారు. ప్రజలు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొమిరెడ్డి పెద్ద నారాయణ, మున్సిపల్ కమిషనర్ దేవేందర్ దంపతులు, రాజిరెడ్డి, దుబాసి నర్సింలు, బండారి నర్సారెడ్డి, బండారి రాజిరెడ్డి, అంజిల్‌రెడ్డి, యాదవరెడ్డి పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

తాడ్వాయి/నాగిరెడ్డిపేట/లింగంపేట/రామారెడ్డి/ సదాశివనగర్: ఎల్లారెడ్డి నియోజకవర్గం పరిధిలోని పలు మండలాలు, గ్రామాల్లో శనివారం పలు బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. తాడ్వాయి మండలం చందాపూర్, ఎర్రాపహాడ్, ఎండ్రియాల్, సంగోజివాడి, నందివాడ తదితర గ్రామాలలో బాధిత కుటుంబాలకు పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు చెక్కులను అందజేశారు. నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద సొసైటీ చైర్మన్ నర్సింలుకు సీఎంఆర్ ఎఫ్ చెక్కును మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, నాయకులు అందజేశారు. అలాగే లింగంపేటలో పలువురికి మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ చెక్కులను అందజేశారు. రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికుంట నర్సాగౌడ్, నాయకులు అందజేశారు. సదాశివనగర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, నాయకులు పంపిణీ చేశారు.



చందాపూర్‌లో బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు



రెడ్డిపేట గ్రామంలో..



మాల్తుమ్మెదలో..



లింగంపేటలో..



సదాశివనగర్‌లో..

సంక్షిప్తం

క్రీడా దుస్తుల పంపిణీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మోతె గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులకు శనివారం గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డి క్రీడా దుస్తులు వితరణ చేశారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి దుస్తులు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కూచిపూడిలో శ్రీవల్లి ప్రతిభ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం గ్రామానికి చెందిన చిన్నారి శ్రీవల్లీ "బెస్ట్ చైల్డ్ క్లాసికల్ డ్యాన్సర్" అవార్డును అందుకుంది. సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో రవిశ్రీ యునివర్సిటీ ఆధ్వర్యంలో నేషనల్ ప్రిమియర్ అవార్డు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీవల్లీ కూచిపుడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఈసందర్భంగా నిర్వాహకులు చిన్నారికి అవార్డు అందజేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

మాచారెడ్డి: అక్కాపూర్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మడేలేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన సంగోల్ల దివ్య, శేఖర్ దంపతులు శనివారం ఆలయ అభివృద్ధి కోసం రూ. 60వేలు విరాళం అందించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్‌చంద్రం, గ్రామస్తులు రమేష్, బాబు, ఎల్లయ్య, శ్రీనివాస్ రెడ్డి, లింగం, దేవరాజు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

భిక్కనూరు: మండలంలో యువజన కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి అన్నారు. మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీరామ్ వెంకటేష్‌ను శనివారం ఆయన సత్కరించి అభినందించారు. చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో యువజన కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. దయాకర్ రెడ్డి, జీడి భూపాల్, కిరణ్ కుమార్ ఉన్నారు.

రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి



భిక్కనూరు: హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ కార్నివాల్ పోటీలలో భిక్కనూరు జెడ్పీ హైస్కూల్‌కు ద్వితీయ బహుమతి లభించింది. పాఠశాల విద్యార్థులు పలు రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేయగా, నిర్వాహకులు వాటిని పరిశీలించి, ద్వితీయ బహుమతిని ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. హెచ్‌ఎం శ్రీనాథ్, సైన్స్ ఉపాధ్యాయులు తుమ్మల రాజు, సరిత ఆధ్వర్యంలో నందిని, మహేష్, కీర్తన, విశ్వక్, రాజు పలు ప్రదర్శనలు రూపొందించారు.

కేజ్‌వీల్స్‌తో ధ్వంసమవుతున్న రోడ్లు



బుడిమి రోడ్డుపై వెళ్తున్న కేజ్‌వీల్ ట్రాక్టర్

బాన్సువాడ రూరల్: ప్రస్తుతం యాసంగి వరినాట్లు ముమ్మరంగా సాగుతుండటంతో కేజ్‌వీల్స్‌తో కూడిన ట్రాక్టర్‌లను రైతులు రోడ్ల పైనుంచి పంటపొలాలకు తీసుకెళ్తున్నారు. దీంతో బీటీ, సీసీరోడ్లు ధ్వంసం అవుతున్నాయి. రూ.లక్షలాది నిధులు వెచ్చించి వేసిన రోడ్లు కేజ్‌వీల్స్ కారణంగా పాడైపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టీలు వేయని కేజ్‌వీల్స్ రోడ్లపై తిప్పితే జరిమానా విధించాల్సిన అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాల వారీగా ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పించాలని, రోడ్లపై కేజ్‌వీల్స్ తిరిగితే, జరిమానాలు విధించాలని ప్రజలు కోరుతున్నారు.





కొక్కొండలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు.. లింగంపల్లిలో..

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

లింగంపేట/ఎల్లారెడ్డిరూరల్/గాంధారి/నాగిరెడ్డిపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు జిల్లా నాయకులు సూచించారు. జిల్లాలోని పలు మండలాల్లో శనివారం పార్టీ శ్రేణులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. రానున్న ఎన్నికల్లో అందరూ సమన్వయంతో పని చేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. అలాగూ పలు మండలాల్లో పారీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమాల్లో ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.





గాంధారిలో ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నాయకులు.. జగదాంబ తండాలో..

క్యాలెండర్ల ఆవిష్కరణ



కామారెడ్డిలో తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్



పీఆర్టీయూ ఆధ్వర్యంలో..



బీబీపేట గ్రామంలో..

కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారంతెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నూతన క్యాలెండర్‌ను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పీఆర్టీయూ క్యాలెండర్లను ఆవిష్కరించారు. తపస్ ప్రతినిధులు పుల్లం రాఘవరెడ్డి, భునేకర్ సంతోష్, లక్ష్మీపతి, ఆంజనేయులు, రాజశేఖర్, భాస్కర్, సంతోష్, పవన్, దత్తాచారి, పీఆర్టీయూ ప్రతినిధులు అంబీర్ మనోహర్‌రావు, లక్ష్మీరాజం, ప్రభాకర్, గిరి, సురేందర్, వెంకట్, ఎల్లాగౌడ్, సబాత్ కృష్ణ, సునీల్, బాలచంద్రం, శుభరత్నం పాల్గొన్నారు.

బీబీపేట: మండల కేంద్రంలోని జమదగ్ని సిండికేట్ సంఘం సభ్యులు శనివారం స్థానిక ఎల్లమ్మ ఆలయం వద్ద నూతన క్యాలెండర్లను ఆవిష్కరించారు. గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్నకు ఘన నివాళి





కామారెడ్డిలో నివాళులు అర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు.. ఎల్లారెడ్డిలో

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వడ్డెర కులస్తులు, బీసీ సంఘం ప్రతినిధులు, అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. వడ్డెరల జాతికోసం ఓబన్న చేసిన కృషిని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు అందరం కృషిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రాంపూర్‌లో..

సమాచారం..

నేడు బాన్సువాడకు ఎమ్మెల్సీ కవిత రాక

బాన్సువాడ/నస్రుల్లాబాద్: బాన్సువాడ పట్టణానికి ఆదివారం సాయంత్రం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రానున్నట్లు బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ శనివారం తెలిపారు. నియోజకవర్గంలోని బడాపహాడ్ దర్గాను కవిత సందర్శిస్తారని, అనంతరం సాయంత్రం బాన్సువాడ అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించే బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆమె ప్రసంగిస్తారని వారు అన్నారు. కావున బీఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో బాన్సువాడకు తరలిరావాలని ఆయన కోరారు.

తెలుగు కవి సమ్మేళనం

దోమకొండ: దోమకొండ గడికోటలో ఆదివారం తెలుగు కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యనందరావ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ శాఖాధిపతి కసిరెడ్డి వెంకటరెడ్డి హాజరువుతారన్నారు. తెలుగు ప్రాచీన సాహిత్య-జానపద సాహిత్య సమాలోచన అనే అంశంపై సదస్సు ఉంటుందన్నారు.

తాడ్వాయిలో రక్తదాన శిబిరం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం వివేకానందస్వామి జయంతి సందర్భంగా యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు గొల్లనవీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం చేసే యువకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. వివరాల కోసం 9010449910ను సంప్రదించాలన్నారు.

దేవీ విహార్‌లో ముగ్గుల పోటీలు

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవి విహార్ వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం సామాజిక సమరసత(ఎస్ఎస్‌వీ) వేదిక ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు వేదిక గౌరవ అధ్యక్షుడు రామచంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే మహిళలు రంగులను సొంతంగా వెంట తెచ్చుకోవాలని, విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.